జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 4-4-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 299 పేజీలు: 4 వెల : రూ.7



# సొమ్ము కొట్టు.. మందు షాప్ పెట్టు

* కాసులిస్తే ఇస్తే నిబంధనలు ఉండవు
* ఎక్సైజ్ శాఖలో కొత్త ట్రెండ్
* రైతు బజార్ రోడ్డులో మద్యం షాప్ ఇలానే పెట్టారట
* షాపు ఎత్తేయాలంటూ స్థానికుల ఆందోళన
* కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 3 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని రైతు బజారు సమీపంలో జగన్నాథ స్వామి మందిరం వద్ద వైన్ షాప్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారు. దాని యజమానిగా చెలామణి అవుతున్న వ్యక్తి ఈ షాప్‌ను గీత కార్మికుల నుంచి తక్కువ ధరకు కొట్టేశాడు. అక్కడితో ఆగకుండా హాస్పిటల్ జోన్‌లో మద్యం షాప్ పెట్టేశాడు. దీనికి ఎక్సైజ్ శాఖలో కొందరు పైస్థాయి అధికారులు భారీ మొత్తంలో లంచం తీసుకొని సహకరిస్తున్నట్లు ఆ శాఖలో సిబ్బందే బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. 100 మీటర్ల లోపు హాస్పిటల్, జగన్నాథస్వామి ఆలయం ఉన్నాయి. అయితే అవి ఇంకా ఎక్కువ దూరంలో ఉన్నాయి అని ఎక్సైజ్ శాఖ అధికారులను షాప్ యజమాని నమ్మిస్తున్నాడు. అతడు ఇచ్చిన లంచాలు తీసుకోవడం వల్ల ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా సైలెంట్ అయిపోయారు. పర్మినెంట్ లైసెన్స్ వచ్చేవరకు మేనేజ్ చేయాలని షాప్ యజమాని ఎక్సైజ్ అధికారులను కోరినట్టు సమాచారం. పర్మినెంట్ లైసెన్స్ వచ్చాక ఎమ్మెల్యే, మంత్రి తలచుకున్నా తమనేం చేయలేరని సన్నిహితులు (సిండికేట్) వద్ద పేలుతున్నాడు. పర్మినెంట్ లైసెన్స్ వచ్చాక ఎవరైనా అడ్డుకుంటే న్యాయస్థానానికి వెళ్లిపోతానని సహచరుల వద్ద చెబుతున్నాడు. అతడు తానా అంటే ఎక్సైజ్ అధికారులు తందానా అంటున్నారు. అందుకే ఈ షాప్ ని ఏర్పాటు చేసిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడ షాపులు కొందరు కలిసి ఏర్పాటు చేసినట్టు తెలిసింది. అందులో ఒకడు నమ్ముకున్న వారికి టోపీ పెట్టడంలో ఘనుడు. అలా కొందరికి టోపీ పెట్టి కోట్లు గడించారని కొందరు బహిరంగంగానే చెబుతున్నారు.

### ఉద్యమానికి రెడీ

జనావాసాలు, ఆసుపత్రులు మధ్య వైన్ షాప్ ఏర్పాటు చేయడం మీద స్థానికులు, ప్రజా సంఘాలు ఉద్యమానికి సిద్ధమవుతున్నాయి. దీనిమీద కలెక్టర్‌ని కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. హిందూ సంఘాలు కూడా జగన్నాథస్వామి ఆలయానికి దగ్గరలో మద్యం షాప్ పెట్టడం మీద ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొందరు మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ఆలయాలు, చర్చిల గోడలపై రాతలు రాస్తున్నారు. దీనిపై పోలీసులు కూడా సీరియస్‌గా ఉన్నారు. అయితే ఆలయానికి సమీపంలో మద్యం షాపు వెలసింది. మందుబాబులు మద్యం మత్తులో ఇలాంటి రాతలు రాస్తే మళ్లీ మతవిద్వేషాలు రగిలే అవకాశం ఉందని కొందరు చెబుతున్నారు. ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఇక్కడి నుంచి మద్యం షాపును తరలించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## నగరాన్ని వణికిస్తున్న..

# స్క్రాప్ మాఫియా!

* అనుమతుల్లేకుండా అక్రమంగా గోదాముల నిర్వహణ
* నిబంధనలు విస్మరిస్తుండడంతో అగ్నిప్రమాదాల భయం
* రాజకీయ అండదండలతో రెచ్చిపోతున్న నిర్వాహకులు
* మౌనం దాలుస్తున్న అధికారులు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 3 (వార్త):** శ్రీకాకుళం నగరంలో స్క్రాప్ మాఫియా రాజ్యమేలుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి, అక్రమ గోదాములతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రామలక్ష్మణ్ జంక్షన్, యాతపేట, కొత్త రోడ్డు జంక్షన్ ప్రాంతాల్లో భారీ స్క్రాప్ గోదాములు వెలిశాయి. వీటికి ఎలాంటి అనుమతులు లేకపోయినా, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నివాస ప్రాంతాల్లోనే ఈ గోదాములు ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇక్కడ భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, కనీసం అగ్నిమాపక పరికరాలు కూడా లేవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద జరిగిన అగ్నిప్రమాదం ఇంకా మరువకముందే, నగరంలో మరో ప్రమాదం పొంచివుందన్న భయం ప్రజలను వెంటాడుతోంది. రాజకీయ నేతల అండదండలతో ఈ మాఫియా రెచ్చిపోతోందని సమాచారం. అధికారులు తనిఖీలకు ప్రయత్నించినా, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వెనక్కి తగ్గాల్సి వస్తోందని తెలుస్తోంది. ఈ దుకాణాల నుంచి వస్తున్న దుర్వాసన వల్ల చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషపూరిత లోహాలు గాలిలో కలిసి ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అక్రమ గోదాములను మూసివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే, రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## ఏసీబీ వలలో

# డీఎంహెచ్‌వో, సీసీ

* రీపోస్టింగ్ ఆర్డర్ కోసం రూ.20వేలు డిమాండ్
* ఏసీబీని ఆశ్రయించిన ఉద్యోగిని
* రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 3 (వార్త):** జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఆ శాఖ ఉద్యోగిని డీఎంహెచ్‌వోను పట్టించడం జిల్లాలో సంచలనమైంది. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సీనియర్ సహాయకురాలిగా పనిచేసిన దివ్యాంగురాలు ఆదివరపు కాంతమ్మ గతేడాది అక్టోబరు 2న మెడికల్ లీవ్ పెట్టింది. ఆ తర్వాత ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరు అయింది. అనంతరం రీపోస్టింగ్ కోసం ఆర్జేడీని సంప్రదించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఆమెకు రీపోస్టింగ్ ఇవ్వాలంటూ శ్రీకాకుళం డీఎంహెచ్‌వోకు ఆర్జేడీ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో కాంతమ్మ రీ పోస్టింగ్ కోసం డీఎంహెచ్‌వో డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణను ఆశ్రయించింది. ఆయన ఆ ఆర్డర్ కాపీ ఇచ్చేందుకు రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. ఆమె పదివేలు ఇస్తానని చెప్పినా.. రూ.20వేలు ఇస్తేనే రీపోస్టింగ్ ఆర్డర్ ఇస్తానంటూ డీఎంహెచ్‌వో చెప్పారు. దీంతో ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వోను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు సన్నాగం పన్నారు. గురువారం కాంతమ్మకు రసాయనం పూసిన రూ.20వేలను అందజేశారు. కాంతమ్మ ఆ డబ్బులను తీసుకెళ్లి.. డీఎంహెచ్‌వోకు వెళ్లి అందజేసింది. డీఎంహెచ్‌వో పక్కనే ఉన్న క్యాంప్ క్లర్క్ వాన సరేష్‌కు ఆ డబ్బులను ఇవ్వగా... వాటిని లెక్కించాడు. రూ.20వేలు సరిగానే ఉన్నాయని చెప్పాడు. అదే సమయంలో అక్కడ మాటు వేసిన ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సిబ్బంది దాడి చేసి డీఎంహెచ్‌వో, సీసీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి విశాఖపట్నం ఏసీబీ కోర్టుకు తరలించామని ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపారు.



## డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు భర్తీ నిలిపివేత

**శ్రీకాకుళం, ఏప్రిల్ 3(వార్త):** జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు భర్తీ ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు..గత నెల 26న విడుదలైన ప్రకటనలో ఈ పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అయితే, పరిపాలనా కారణాల దృష్ట్యా ఈ ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## నాగబాబుకు అభినందనలు



**ఎల్ఎన్ పేట / హిరమండలం ఏప్రిల్ 3 (వార్త):** నూతన ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసిన జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబుకు శ్రీకాకుళం జిల్లా,పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఆయన జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకువెళ్తారన్నారు.

# పలాస-కాశీబుగ్గ రూపురేఖలే మార్చేస్తా

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**

**-రూ. 34 లక్షలతో సీసీ రోడ్లు,**

**కాలువ పనులకు శంకుస్థాపన**




**పలాస, ఏప్రిల్ 3(వార్త):** పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామని, ప్రతీ వార్డులో తాగునీరు, రోడ్లు, మౌళిక సదుపాయాలు కల్పించి పట్టణ రూపురేఖలే మార్చేస్తానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శాంతి నగర్, తాళభద్ర, రాజాం కాలనీ, పెద్ద బ్రాహ్మణ వీధి, నీలాపురం, నర్సిపురం తదితర ప్రాంతాల్లో గురువారం రూ. 34 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, మురికి కాలువలు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 42 లక్షల నిధులను మంజూరు చేసి పారిశుధ్య పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీను నేరవేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎంపీ నిధులతో కొన్ని వార్డుల్లో పవర్ బోర్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రతీ వార్డులో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణం చేపడతామన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మున్సిపల్ కమిషనర్ ఎన్ రామారావు, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు, వార్డు ఇన్చార్జులు చెల్లూరు రామకృష్ణ, కొత్త సత్యం, టి తిరుమల రావు, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ త్యాడి, మల్లా శ్రీనివాసరావు, ఎం నరేంద్ర, దువ్వాడ శ్రీకాంత్, బి నాగరాజు, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, కొండే నర్సింహులు, సార నోములు, కుమ్మరి ఆత్మ రావు, కొరికాన శంకర్, జోగ మల్లి పాల్గొన్నారు.

# పైలా 15వ వర్ధంతిని జయప్రదం చేయండి




**పలాస, ఏప్రిల్ 3(వార్త):** శ్రీకాకుళం వీరోచిత సాయుధ పోరాట నేత, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ లెనినిస్ట్) న్యూ డెమొక్రసీ ప్రముఖ నాయకులు అమరజీవి పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభ ఏప్రిల్ 13వ తేదీన పలాసలో నిర్వహిస్తున్నామని, ఈ సభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ శ్రీకాకుళం జిల్లా కమిటీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో న్యూడెమొక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి ప్రసాద్ మాట్లాడుతూ భారత విప్లవోద్యమంలో అగ్ర నాయకుల్లో కామ్రేడ్ పైలా ఒకరని ఉపాధ్యాయ వృత్తిని వదిలి ఉద్యమాల బాట పట్టి 42వేల అజ్ఞాత జీవితం గడిపిన విప్లవకారుడు కామ్రేడ్ పైలాని అన్నారు. ఏప్రిల్ 13వ తేదీన జరుగు పైల 15వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వారం పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని కార్యకర్తలుకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి మాధవరావు, పార్టీ, ప్రజా సంఘాల నాయకులు గౌరకల బాలకృష్ణ, జుత్తు వీరాస్వామి, పోతనపల్లి కుసుమ, వంకల పాపయ్య, కుత్తుము హేమ, మురిపిండి తాతారావు, సారా జగన్, సాంగ్ర రామారావు, బర్ల గోపి, గర్తం కామేశ్వర్రావు, మద్దిల వినోద్, మామిడి భీమయ్య, బదకల ఈశ్వరి, జానకి, జడ్డే అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎంవీఐ కేంద్రం పలాసలో కొనసాగించాలి



**పలాస, ఏప్రిల్ 3(వార్త):** ఎంవిఐ కేంద్రమును పలాసలో కొనసాగించాలని,ఆటోడ్రైవర్ల సమస్యలు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని ప్రముఖ సంఘ సేవకుడు, పిఎసిఎస్ పలాస మాజీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీధర్( బాబా) డిమాండ్ చేశారు. గురువారం ఆటో డ్రైవర్లు విజ్ఞప్తి మేరకు బాబా స్వగృహంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఆటో వాహనాల ఫిట్నెస్ పరీక్షల సమస్య కోసం శ్రీకాకుళంలోని ఆర్టీవో ఆఫీస్ కు వెళ్లాలని సూచించడంతో డ్రైవర్లు తీవ్ర వేదనకు గురవుతున్నారని ఆయన చెప్పారు. ఆటో డ్రైవర్లు తమ వాహనాల ఫిట్నెస్ పరీక్షల నిమిత్తం జిల్లా కేంద్రానికి క్వార్టర్లకి వెళ్లాలంటే,శ్రీకాకుళం లాంటి జిల్లాలలో చివరి నియోజకవర్గమైన ఇచ్ఛాపురం, పలాస నుంచి సుమారు150, 80 కిలోమీటర్లు ఉండటంతో వారు చాలా ఇబ్బంది పడుతున్నారని, ఆ ఫిట్నెస్ టెస్టులు జరిపించుకోకపోతే జరిమానాలు విధిస్తున్నారని, దీనిపై రవాణా శాఖ తగిన ప్రత్యామ్నాయాలు చూపించాలని డిమాండ్ చేశారు. కొంత మంది ఆటో యూనియన్స్ , డ్రైవర్లు నా దృష్టికి తీసుకొచ్చిన ఆటో ఫిట్నెస్ పరీక్షల సమస్య కోసం సుమారు 5000 ఆటోలు తో వ్యక్తి గతం గా జీవనోపాది సాగిస్తున్న ఆటో డ్రైవర్లు ఆటో ఫిట్ సర్టిఫికెట్ ప్రతీ సంవత్సరం ఆటో యజమాని చేసుకోవాలనే ప్రభుత్వం నిబంధన ఉంది,ఇదివరకు పలాస లోనే ఆటో "ఫిట్" సర్టిఫికెట్స్ మంజూరు చేసేవారు మోటారు వెహికల్ ఇన్ స్పెక్టర్, కానీ ఇప్పుడు కొత్తగా శ్రీకాకుళం ఆర్టీవో ఆఫీస్ లో ఫిట్ సర్టిఫికెట్ కోసం ఆటో లు వెళ్ళాలి అనే నిబంధన తేవడం వల్ల పలాస నియోజకవర్గం లో ఉన్న ఆటో డ్రైవర్లు నానా ఇబ్బందులకు గురి అవుతున్నారు ఇది చాలా బాధాకరం, ఇన్ని వేల ఆటో లు హైవే పై శ్రీకాకుళం వరకు వెళ్ళాలి అంటే ఆటో డ్రైవర్ కీ చాలా ఇబ్బంది కనుక ఎప్పటిలానే పలాస లో ఉన్న ఎం వి ఐ కార్యాలయం లో ఆటో ఫిట్ సర్టిఫికెట్స్ ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నానని వెల్లడించారు.

# ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



**పలాస, ఏప్రిల్ 3(వార్త):** ఆటో ఫిట్నెస్ పరీక్షలు చేయించేందుకు నానా అవస్థలు పడుతున్నామని, ఈ సమస్యను పరిష్కరించాలని ఆటో కార్మికులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకువిజ్ఞప్తి చేశారు. ఆటో యూనియన్ల గౌరవాధ్యక్షుడు, 18 వ వార్డు కౌన్సిలర్, టీడీపీ నాయకుడు దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులంతా ఎమ్మెల్యే శిరీషను ఆమె కార్యాలయంలో గురువారం కలిశారు. ప్రస్తుతం ఆటో ఫిట్ నెస్ పరీక్షలు చేయించాలంటే ఎచ్చెర్ల వెళ్ళాల్సి వస్తోందని, ఈ నేపథ్యంలో రానుపోను రెండొందల కిలోమీటర్లు ఆటోతో ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. అనివార్యకారణాల తో పరీక్ష వాయిదా పడితే ఇబ్బందులు అధికంగా ఉన్నట్టు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ డ్రైవర్లు పాల్గొన్నారు.



## పేద కుటుంబాలకు ఆసరా సీఎం సహాయనిధి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 3(వార్త):** పేద కుటుంబాలకు ఆసరాగా నిలిచేది ముఖ్య మంత్రి సహాయనిధి అని, ఎన్నో కుటుంబాలు సహాయం పొందుతున్నాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో గార మండలం రామచంద్రపురానికి చెందిన గొలివి ప్రతాప్కు వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయం నిధి నుంచి వచ్చిన రూ.10లక్షల ఎల్ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైద్యం అందక ఎన్నో ప్రాణాలు పోయాయని, అటువంటి పరిస్థితి నేడు లేదని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## కత్తితో తండ్రీ..కొడుకులపై దాడి

**కోటబొమ్మాళి, ఏప్రిల్ 3(వార్త):** చిన్నసాన పంచాయతీ గంగుపేట గ్రామానికి చెందిన చదునుపల్లి రాము ఆర్మీజవాన్ అదే గ్రామానికి చెందిన చదునుపల్లి అప్పన్న, ఆయన కుమారుడు చదునుపల్లి హరిబాబుపై గురువారం ఉదయం కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. వివరాల్లోకి వెళితే గాయపడిన చదునుపల్లి అప్పన్నకు అన్న కుమారుడ్కైన చదునుపల్లి రాముకు ఇటీవల భూవివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కూడా వీరు ఇరువురు మధ్య మాటమాట పెరిగి రాము ఆకస్మత్తుగా కత్తితో అప్పన్నపై దాడి చేయగా ఆ సమయంలో అక్కడే ఉన్న అప్పన్న కుమారుడు హరిబాబు అడ్డగించే ప్రయత్నంలో హరిబాబుకూడా గాయ పడ్డాడు. ఈ తరుణంలో గ్రామస్థులు కలుగుచేసుకొని గాయపడిన తండ్రి కొడుకులను 108 వాహనం సహాయంతో టెక్కలి జిల్లా అసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సూచనమేరకు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్కు తరలించారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నాట్లు తెలిపారు.

## రెండు ఈత చెట్లు దగ్ధం

**కోటబొమ్మాళి, ఏప్రిల్ 3(వార్త):** స్థానిక మెయిన్రోడ్డులో పి.రాంబాబుకు చెందిన రెండు ఈతచెట్లు గురువారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. ఖాళీ స్థలంలో పారిశుద్యం నిర్వహించి అ చెత్తను ఈత చెట్లుకు సమీపంలో నిప్పుపెట్టడంతో ఈ ప్రమాధం జరిగింది. చెత్తకు నిప్పుపెట్టి వారు ఇంటికి వెళ్ళిపోయిన కొద్ది నిమషాలకు కాలుతున్న నిప్పురవ్వలు ఈత చెట్లుకు పైకి ఎగసిపడి రాజుకొని దగ్ధమయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి ఆగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఆగ్నిమాపక చెకటం అక్కడకు చేరుకొని మంటలను అదుపుచేశామని ఆగ్నిమాపక అధికారి పీఆర్ రెడ్డి తెలిపారు. అయితే ముదురుతున్న ఎండలు నేపద్యంలో మరిన్ని భయంకరమైన అగ్ని ప్రమాధాలు జరిగే అవకాశం ఉందని కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## ప్రైవేట్ ఉపాధ్యాయునికి నిత్యావసర సరుకులు పంపిణీ

**శ్రీకాకుళం, ఏప్రిల్ 3(వార్త):** ఆపద సేవే, మాధవ సేవని రెడ్క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు గురువారం అన్నారు. స్థానిక పిఎన్ కోలనీ వినాయకుని ఆలయ ప్రాంగణములో ప్రైవేట్ ఉపాధ్యాయులు కరకవలస.సంతోష్ సాగర్ కు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి మాట్లాడుతూ స్థానిక ఠాగూర్ పబ్లిక్ పాఠశాలలో మాథెమాటిక్స్ ఉపాధ్యాయులుగా సేవలందిస్తూ కొన్ని నెలల క్రిందట జరిగిన రహదారి ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమయ్యారని, వీరి కుటుంబ పరిస్థితి అంతంతమాత్రమే కావటంతో ఈ విషయాన్ని ఆముదాలవలసకు చెందిన చందు, రెడ్క్రాస్ ప్రతినిధి నంది ఉమా శంకర్కు తెలియజేయడంతో ఆయన పెట్టిన వాట్స్ ఆప్ స్టేటస్ కు స్పందించి నగరానికి చెందిన సుసరాపు శ్రీలత, దాసరి రవికుమార్, స్టేట్ బ్యాంకు అసోసియేట్ నల్ల గౌతమి అందించిన సహకారంతో సుమారు మూడు నెలలకు సరిపోయే సరుకులు, 26 కేజీల బియ్యంతోపాటు సేకరించిన కొంత నగదునిసైతం అందించి ఆదుకోవటం హర్షణీయమన్నారు. ఆపదలో ఉండేవారిని ఆదుకోవటమే, నిజమైన మానవత్వమన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు నగదుని అందించిన జగన్ మోహన రావుకు, నేటి దాతలకు పేరు పేరునా కృతజ్ఞతాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, దాతలు సుసరాపు శ్రీలత, దాసరి రవికుమార్, స్టేట్ బ్యాంకు అసోసియేట్ నల్ల గౌతమి, ఆలయ సభ్యులు, రెడ్క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, సేవకులు ఉర్లం శివతేజ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రాత్రి 11 గంటల తరువాత సంచరిస్తే చట్టపరమైన చర్యలు : డీఎస్పీ



**శ్రీకాకుళం, ఏప్రిల్ 3(వార్త):** శ్రీకాకుళంలో ఎటువంటి కారణం లేకుండా అర్ధ రాత్రుళ్ళు బహిరంగంగా తిరిగిన వారిపై కేసులు తప్పవని శ్రీకాకుళం టౌన్ డిఎస్పీ సి.హెచ్. వివేకానంద్ గురువారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు.సబ్ డివజన్ పరిధిలో రైల్వే స్టేషను, ఆర్టీసి కాంప్లెక్స్, కొన్ని ముఖ్యమైన జంక్షన్లో నిరంతరం తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.రాత్రి 11గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకొంటూ, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా, కారణాలు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించిన వారిపై టౌన్ న్యూసెన్సు చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టణ ప్రజలు పోలీసు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.



## మాజీ ఎంపీటీసీ మృతికి సంతాపం

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 3(వార్త):** ఈదుపురం మాజీ ఎంపీటీసీ గయా రత్నాలు బెహరా మృతికి సంతాపం తెలియజేసి కుటుంబ సభ్యులు రామచంద్ర బెహరా బీమ్మో బెహరా కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ తెలియజేశారు. ఆమెతో పాటు ఎంపీపీ బోర పుష్ప, వైస్సార్సీపీ నియోజకవర్గం యువజన అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్, కారింగి మోహన్ రావు, సర్పంచ్లు నర్తు వరప్రసాద్ యాదవ్, నీలాపు సారధి రెడ్డి ,సాడి గురుమూర్తి రెడ్డి, కారింగి త్రినాధ్ రెడ్డి ,వైస్ సర్పంచ్ మురా బెహరా, నర్తు భానోజీరావు, మోహన్ బెహరా ,బోనమాలి బెహరా తదితరులు ఉన్నారు.

## పోస్ట్ ఆఫీసులో ప్రింటర్ సేవలు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 3(వార్త):** స్థానిక సబ్ పోస్ట్ ఆఫీస్ లో శ్రీకాకుళం జిల్లా పోస్టల్ అధికారి వి. హరిబాబు వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పోస్ట్ ఆఫీస్ లో ఖాతాదారుల సౌకర్యం కోసం అదనంగా కౌంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. ఖాతాదారుల పుస్తకం ప్రింటింగ్ కొరకు కొత్తగా ప్రింటర్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొద్దిరోజుల్లో స్థానిక పోస్ట్ ఆఫీస్ లో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకొని వస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా తేడాది 1,70,000 ఖాతాల(అన్ని రకాల) ను తెరవడం జరిగిందని అన్నారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ భవనం మరమ్మతుల గురించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఇందులో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ సోంపేట సబ్ డివిజన్,నక్క శ్రీకాంత్, స్థానిక పోస్ట్మాస్టర్ జ్ఞానేశ్వరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 5న సూర్యోదయలో ఉచిత వైద్య శిబిరం



**మందస, ఏప్రిల్ 3(వార్త):** మందస పట్టణంలోని అగ్ని గంగా వారి సూర్యోదయ స్కూల్ లో ఈ నెల 5న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ స్కూల్ డైరెక్టర్ మోణంగి నాగేశ్వరరావు చెప్పారు. మందసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అగ్ని గంగా జ్యూయలరి, జిరాక్స్, వన్ గ్రామ్ గోల్డ్, అగ్నిగంగా వారి సూర్యోదయ స్కూల్ సహకారంతో శనివారం ఉదయం 9 గంటల నుండి మందసలో గల సూర్యోదయ స్కూల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. జెమ్స్ ఆసుపత్రి, ఉద్దానం బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో శిబిరం జరుగుతుందని, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, ఆప్తామాలజీ తదితర స్పెషలిస్ట్ వైద్యులు సేవలు అందిస్తారన్నారు. ఈసీజీ, షుగర్, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా చేయబడుతుందన్నారు. ఉచితంగా మందులు కూడా ఇవ్వబడతాయని, ఈ సదవకాశాన్ని మందస మరియు తదితర పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

**మందస, ఏప్రిల్ 3(వార్త):** మందస మండలంలోని జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఓ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ చెప్పిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడ నుంచి ఒడిశాకు మిరపకాయల లోడుతో లారీ వెళ్తుండగా, జాతీయ రహదారిపై బిన్నళమదనాపురం గ్రామం సమీపంలో లారీ అదుపు తప్పింది. ప్రమాదం పసిగట్టిన డ్రైవర్ కిందకు దూకే ప్రయత్నం చేయగా.. లారీ ఆయనపైనే బోల్తా పడింది. దీంతో డ్రైవర్ గుంటూరుకు చెందిన ఎస్కే ఖాజా (42) అక్కడికక్కడే మరణించాడు. క్లీనర్ కూడా గాయలవ్వడంతో అంబులెన్స్ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఎస్ఐ కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## తాగునీటి సమస్య లేకుండా చూస్తాం : శిరీష



**పలాస, ఏప్రిల్ 3(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ న్యూ కాలనీలో గురువారం మున్సిపల్ సాధారణ నిధులు రూ. 20 లక్షలు వ్యయంతో సరఫరా చేయనున్నా నీటి ట్యాంకులకు ఆమె పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్న వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి ప్రాధాన్యతగా తాగునీటి పైనే దృష్టి పెట్టామన్నారు. ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు నుంచి పలాస కాశీబుగ్గ పట్టణాలకు వేసవిలో తాగునీరు అందిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని, మరోవైపు పనులు జరుగుతున్నాయన్నారు. తాగునీరు కోసం మహిళలు ఇబ్బందులు పడనవసరం లేదని, ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు నుంచి నీరు వచ్చే వరకు మున్సిపల్ వీధులకు రోజుకు 24 ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. పలాస ప్రాంతానికి 12 ట్యాంకులు, కాశీబుగ్గ ప్రాంతానికి 12 ట్యాంకుల చొప్పున నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసే సమయంలో మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయం చేస్తూ సక్రమంగా నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు,మున్సిపల్ కమిషనర్ ఎన్ రామారావు, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్, పలాస ఏఎంసి అధ్యక్షులు మల్లా శ్రీనివాసరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, వార్డు ఇన్చార్జి కొత్త సత్యం, చెల్లూరు రామకృష్ణ, ఎం నరేంద్ర, దువ్వాడ శ్రీకాంత్, బి నాగరాజు, సప్ప నవీన్, అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొద్దాం




**కోటబొమ్మాళి, ఏప్రిల్ 3(వార్త):** కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఒకప్పుడు 500 మంది విద్యార్థులతో కళకళ లాడేదని, వేర్వేరు కారణాలతో ఇప్పుడు కేవలం 200 మందికి పడిపోయిందని, మనమంతా ప్రజలకు అవగాహన కల్పించి ఈ పాఠశాలకు పూర్వపు వైభవం తీసుకువద్దామని ఆ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. గురువారం విద్యార్థులను మళ్ళి పునరుద్ధరించడానికి అక్కడ ఉపాధ్యాయులు, విద్యా కమిటీ, స్థానిక యువత, పూర్వవిద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలుతో చేయి చేయి కలిపి వినూత్నంగా భవిష్యత్తు కోసం భారీ ర్యాలీ పేరుతో పిల్లల నమోదుకోసం ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టారు. ముఖ్యంగా షణ్ముఖ మాస్టర్ గైడెన్స్లో వినూత్నంగా పిల్లలచే మూడు భాషల్లో వివిధ కళా జాతాలు ప్రదర్శించి ప్రభుత్వబడి గొప్పతనాన్ని వివరించారు. అలాగే నినాదాలతో హోరెత్తించారు. ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందరావు పిల్లల నమోదు కోసం పాటుపడుతున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఇలా చక్కని బోధన చేసే బాధ్యత గల ఉపాధ్యాయులు వుంటే ప్రభుత్వ బడులు కళకళ లాడుతాయని దానికి తమ వంతు సహకారం పూర్తి స్థాయిలో వుంటుంది అని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. అప్పలనాయుడు, రాము, గౌరి, గోపి, దుబ్బ సంతోష్, సింహాచలం, వెంకటరావు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ వేధింపుల నుంచి వ్యాపారులకు రక్షణ కల్పించాలి



**మందస, ఏప్రిల్ 3(వార్త):** ప్రొహిబిసన్, ఎక్సైజ్ శాఖ వేధింపుల నుండి మందస వ్యాపారులకు రక్షణ కల్పించాలని మందస వర్తక సంఘం అధ్యక్షుడు వడ్డి గోపాలకృష్ణ, వర్తక సంఘ సభ్యులు డిప్యూటీ తసిల్దార్ కె.రామకృష్ణ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మందస పట్టణంలో కిరాణా షాపులు పెట్టుకొని జీవిస్తున్నామని, షాపులలో మేము ఎటువంటి చట్ట విరుద్ధమైన వస్తువులను అమ్మకాలు చేయడం లేదన్నారు. కానీ ఎక్సైజ్ పోలీసులు మమ్మలను పదే పదే సోంపేట, పలాస తదితర పోలీస్ స్టేషన్లకు పిలిపించి సారా తయారీకి అవసరమైన నల్ల బెల్లం అమ్ముతున్నారని అని బెదిరిస్తూ బైండోవర్ కేసులు కడతామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విధమైన బెల్లం వ్యాపారం చేయడం లేదని చెబుతున్నప్పటికీ వారు నమ్మడం లేదని, మా షాపుల్ని పరిశీలించి అలాంటి వస్తువులు ఏమైనా ఉంటే చర్య తీసుకోవాలని చెప్తున్నామన్నారు. అయినా వినిపించుకోకుండా మాపై కేసులు పెడతామని, సంతకాలు చేయండంటూ వేధిస్తున్నారన్నారు. ఈ విధంగా వేధిస్తుంటే మేము మా వ్యాపారాలు సవ్యంగా చేసుకోలేకపోతున్నామని, ఏ తప్పు చేయని మాపై చర్యలు ఎందుకు తీసుకుంటున్నారో తెలియడం లేదన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి ఎక్సైజ్ పోలీసులు వేధింపుల నుండి ఆదుకోవాలని, వ్యాపారాలు మేము సవ్యంగా చేసుకునేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మట్ట ధర్మారావు, కె.నరేష్, కె.మహేష్, శ్రవణ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## 100 మంది మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



**మందస, ఏప్రిల్ 3(వార్త):** కుంటికోటలో గల కె.నారాయణ పాఠశాలలో మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్, విశాఖపట్నం సహకారంతో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం విజయవంతంగా నిర్వహించారు. 100 మందికి పైగా మహిళలు స్క్రీనింగ్ చేయించుకున్నారు. స్క్రీనింగ్లో డా.పాల్(ఓరల్ సర్జన్), డా.రేవతి(ఎంబీబీఎస్), డా. హారిక (ఎంబీబీఎస్) సేవలు అందించారు. మహిళల్లో క్యాన్సర్పై అవగాహన పెంచడం, ప్రాథమిక దశలోనే రోగాన్ని గుర్తించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమం విజయవంతంగా సాగడానికి టీచర్లు, సిబ్బంది, తల్లిదండ్రులు, సమాజంలోని సభ్యులు అందించిన సహకారం వెలకట్టలేనిదని, క్యాన్సర్పై అవగాహన కల్పించేందుకు, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించారని వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, మేజర్ హెల్త్ క్యాంప్ను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్, పాల్గొన్న వైద్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని కె.నారాయణ పాఠశాల కరస్పాండెంట్ గుంట రోహిణిశంకర్, డైరెక్టర్స్ గుంట బుద్ధసూర్య, అరవింద్ నారాయణన్ తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఒంటి పూట బడులు శతశాతం అమలు జరపాలి: సీతారాం



**శ్రీకాకుళం, ఏప్రిల్ 3(వార్త):** రాష్ట్రంలో అత్యధికంగా వేసవి ఉష్ణోగ్రతలు నమోదౌతున్న దృష్ట్యా అన్ని పాఠశాలల యాజమాన్యాలు శత శాతం ఒంటిపూట బడులు పక్కాగా అమలు జరిగేలా ప్రత్యేక దృష్టి నిలపాలని ఇప్పటికే తమ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో జిల్లా ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీ ఎస్సీపిసిఆర్)సభ్యులు గొండు సీతారాం చెప్పారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ తమ కమిషన్ ఆదేశాలు,ప్రభుత్వ ఉత్తర్వులు పాటించని పాఠశాలల యాజమాన్యాలపై,డేగకళ్ళతో పర్యవేక్షణ జరపడంతో పాటు ఆయా స్కూళ్లు గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ చర్యలకు వివిధ సిఫారసులు చేయనున్నట్టు తెలిపారు. విద్యార్ధులు,వారి తల్లిదండ్రులు apscpcr2018@gmail.com నేరుగా ఫిర్యాదులు అందించాలని సీతారాం తెలిపారు.

# పాతపట్నంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడులు



**పాతపట్నం, ఏప్రిల్ 3 (వార్త):** నిషిద్ధమైన ఆహార పదార్థాలను విక్రయిస్తే ఆయా దుకాణాలను శాశ్వతంగా మూసివేయడంతో పాటు బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని ఫుడ్ కంట్రోల్ అధికారి కె.వెంకటరత్నం హెచ్చరించారు. గురువారం ఆయన తన బృందంతో పాతపట్నంలోని కిరాణా షాపులు, పాన్ షాపులు, బేకరీలు, టీ దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాతపట్నం ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో ఇకపై తరచూ ఈ తరహా దాడులు ఉంటాయని తెలిపారు. దుకాణాల్లో హానికరమైన, నాణ్యతలేని ఆహార పదార్థాలు తయారుచేసినా, విక్రయించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత ఆహార పదార్థాలను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. చికెన్,మటన్ ఇతర నానన్ వెజ్, విజిటేరియన్స్ లో రంగులు కలిపిన, చైనా సాల్ట్ వినియోగించిన, అపరిశుభ్ర ప్రదేశంలో ఆహార పదార్థాలు ప్రజలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నాణ్యమైన ఆహారాన్ని విక్రయించాలన్నారు. పండ్ల రసాలలో అపరిశుభ్రంగా ఉన్న ఐస్ ను వినియోగించరాదన్నారు. ఐస్ కలిపే పండ్ల రసాలను ప్రజలు సేవించకూడదని కోరారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి కె.లక్ష్మి పాల్గొన్నారు.

# పసి పిల్లలు వద్దనుకుంటే ఊయలలో వేసి రక్షించండి




**పలాస, ఏప్రిల్ 3(వార్త):** పసి పిల్లలు వద్దనుకుంటే ఊయలలో వేసి రక్షించడిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మిషన్ వాత్సల్య లోభాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధ్వర్యంలో గురువారం పలాస ప్రభుత్వాసుపత్రిలో అధికారులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. పసిపిల్లలు వద్దనుకుంటే-ఊయలలో వేసి "రక్షించండి" అనే ఈ కార్యక్రమాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. అడ పిల్లలను, ఆరోగ్యంగా లేని, అంగవైకల్యం కలిగిన, అవాంఛిత గర్భం దాల్చిన పసికందులను చెత్త కుప్పల్లోను, ముళ్ళ పొదల్లోనూ పడేయకుండా ఊయలలో వేసి టోల్ ఫ్రీ నంబర్ల చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181, పోలీస్ శాఖ సంబంధించి 100కు పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, ఆ పిల్లలను శిశు గృహంలో సంరక్షించి, దరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తత ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.యెస్ పిఓ కే పార్వతి, సూపర్వైజర్లు పి గంగమ్మ, సరస్వతి, అధికారులు, వైద్యులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు వైసీపీ రూ.50 వేల సాయం



**పలాస, ఏప్రిల్ 3(వార్త):** పడవ ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు మత్స్యకారుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున వైయస్సార్ కాంగ్రెసు పార్టీ తరపున మాజీ మంత్రి డాక్టర్ సీదిరి ఆర్థిక సహాయంమాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అందజేశారు. నియోజకవర్గంలో అందుబాటులో లేని కారణంగా వజ్రపుకొత్తూరు మండల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ క్యాడర్ చేతులు మీదుగా ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. బాధిత కుటుంబాలతో ఫోన్లో మరోసారి ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పరపల్లి ఉదయకుమార్,జడ్పీటీసీ పాలిన శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశ్వరరావు,పార్టీ అధ్యక్షులు తిర్రి రాజారావు,వైస్ ఎంపీపీ వంక రాజు,మత్స్యకార ఐక్యవేదిక నాయకులు కొమర దేవరాజు, మత్స్యకార నాయకులు అంబటి ఆనంద్,రామకృష్ణ ,దున్న హరికృష్ణ, దున్న బుజ్జి,మడియా రామకృష్ణ,గ్రామస్తులు సంబురావు,సింహాచలం, లక్ష్మయ్య , మోహన్ రావు, వీరాస్వామి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# వెలగని వీధి లైట్లు..తొలగని చీకట్లు



**-ఫిర్యాదు చేసినా పట్టించుకోని పంచాయతీ అధికారులు**

**సంతబొమ్మాళి, ఏప్రిల్ 3(వార్త):** మండలంలో నౌపడ మేజర్ పంచాయతీ పరిధిలోని సాల్ట్ కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో ఆ కాలనీ వాసులు అందాకారంలో రోజులు వెల్లబుచ్చుతున్నారు. గత కొద్ది నెలలుగా కాలనీలో వీధి దీపాలు వెలగకపోయినా అధికారులు పట్టించు కోవడం లేదని స్థానికులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. రాత్రులు, తెల్లవారుజామున బయటకు రావాలంటే చీకటిగా ఉండడంతో భయపడుతు న్నారు. రాత్రివేళ విషసర్పాలు సంచరిస్తుండం, మరోపక్క దొంగల భయంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. కాలనీ మహిళలు గతంలో పంచాయతీ అధికారులకు సచివాలయంకు వెళ్ళి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధిలైట్లను వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## వేంకటేశ్వరుడికి మూడు వెండి చెంబుల వితరణ

**కొత్తూరు, ఏప్రిల్ 3 (వార్త):** కొత్తూరు గ్రామ పంచాయతీలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఇదే గ్రామానికి చెందిన స్టేట్ బ్యాంక్ విశ్రాంతి డిప్యూటీ మేనేజర్ ధూళి. మోహన్ రావు, ఈశ్వరి భాయ్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా దేవాలయంలోని శ్రీ వెంకటేశ్వరునికి మూడు వెండి చెంబులను గురువారం నాడు అర్చకులకు అందజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యులు, లోతుగడ్డ తాతబాబు, బానోజీరావు మాస్టారు, ఇప్పిలి జానకి రామయ్య, పొగిరి రవి తదితర భక్తులు పాల్గొన్నారు.

## లక్ష్మణుని రక్తదానం



**మందస, ఏప్రిల్ 3(వార్త):** కష్టాల్లో ఆదుకునే ఖాకీలు ఎంతోమంది ఉన్నారు. వారంతా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని చెబుతున్న పోలీసులు తాము కూడా రక్తదానం చేస్తున్నారు. మందస పోలీసు స్టేషన్లో హెూంగార్డుగా పని చేస్తున్న రౌతు లక్ష్మణరావు ఇదేదారిలో పయనించి, అందరీ అభినందనలు అందుకున్నారు. భార్గవ్ అనే బాలుడి తలసేమియా వ్యాధితో బాధ పడుతున్నాడు. అతనికి రక్తం అవసరమయ్యింది. విషయం తెలుసుకున్న హెూంగార్డు లక్ష్మణరావు ఆ నలుగురు ట్రస్ట్ ద్వారా రక్తదానం చేసి, ఆదర్శంగా నిలిచారు. లక్ష్మణరావును ఈ సందర్భంగా మందస పోలీసులతో పాటు స్థానికులు కూడా అభినందించారు.

## ఆలయ నిర్మాణానికి రెండు లక్షల విరాళం



**కొత్తూరు, ఏప్రిల్ 3 (వార్త):** గూనభద్ర ఆర్-ఆర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయనికి కొత్తూరు గ్రామానికి చెందిన మల్లా మాధవరావు దంపతులు ఆలయ నిర్మాణం కొరకు 1,00,000 -/ రూపాయలు తో పాటు గ్రానైట్ అమ్మ వారి విగ్రహం కొరకు మరో 1,00,000 /- రూపాయలు తో మొత్తం 2,00,000 విరాళంను గురువారం నాడు కొత్తూరు మండల మాజీ ఏఎంసి చైర్మన్ ప్రతినిధి,టీడీపీ నాయకులు గోగుల వరప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో గూనభద్ర ఆర్ - ఆర్ కాలనీ గ్రామ సర్పంచ్ దాసుబాబు, గ్రామ ప్రజలు ఈ కార్యక్రమం పాల్గొన్నారు.

## అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి

**టెక్కలి, ఏప్రిల్ 3(వార్త):** అన్యాయంగా సస్పెండ్ చేసిన పలాస డిపో కండక్టర్ ఎన్ నీలకంఠం సస్పెన్షన్ రద్దు చేయాలని టెక్కలి డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎస్ మోహన్ రావు డిమాండ్ చేశారు. జోనల్ కమిటీ పిలుపుమేరకు టెక్కలి ఆర్టీసీ గ్యారేజ్ ఎదురుగా ఆ సంఘం ఉద్యోగులు గురువారం ఎర్రబ్యాడ్జీలు ధరించి, భోజన విరామ సమయంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ ఉద్యోగులకు 1/2019 ఉత్తర్వులను కచ్చితంగా అమలు పరచాలని, కొత్త బస్సులకు అనుగుణంగా అన్ని డిపోలలో స్పేర్ పార్ట్స్ లను సప్లై చేయాలని, శ్రీకాకుళం రెండవ డిపో మేనేజర్ అవలంబిస్తున్న మొండివైఖరి విడనాడాలని, ఇటీవల ట్రాఫిక్ సిబ్బందిపై జరుగుచున్న దాడుల నుండి భద్రత కల్పించాలని, ట్రాఫిక్ సిబ్బందికి నైట్ అవుట్ అలవెన్స్ లను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి మురళి, ఎస్ ఎస్ వి రమణ, కే కృష్ణ, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546